## క్లుప్తంగా

### ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



**నందిగామ:** మండలంలోని లింగాలపాడు గ్రామంలో శ్రీ లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం కుంకుమ పూజలు జరిగాయి. ఆ తర్వాత మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ గ్రామ శిలల బోనాల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాత్రి సమయంలో నిర్వహించిన పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు చూపర్లను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాలలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### భక్తులకు మజ్జిగ పంపిణీ



**పెనుగంచిప్రోలు:** గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి ఆలయంలో వేసవి తీవ్రత దృష్ట్యా ఆదివారం భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ మజ్జిగ పంపిణీని గ్రామానికి చెందిన కొనపర్తి విశ్వబ్రహ్మం కుటుంబ సభ్యుల సౌజన్యంతో ఏర్పాటు చేసినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఏఈఓ కొండలరావు, ఉమాపతి పాల్గొన్నారు.

### అల్లూరికి ఘన నివాళి



**జగ్గయ్యపేట అర్బన్:** స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమాన్ని పట్టణంలో ఆదివారం పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ దేశం కోసం బ్రిటిషువారి తూటాలకు ఎదురొడ్డి నిలబడిన అత్యంత ధైర్యశాలిగా భారతదేశ చరిత్రలో నిలిచిపోయిన అల్లూరిని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ వాణిజ్య విభాగం అధ్యక్షుడు చారుగుండ్ల కొండ, పార్టీ నాయకులు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, దువ్వల రామకృష్ణ, కాటగాని నరసింహారావు, చిరంజీవి నివాళులర్పించారు.

### వైభవంగా విగ్రహాల ప్రతిష్ట



**ముండ్లపాడు క్రాస్‌రోడ్స్(పెనుగంచిప్రోలు):** మండల పరిధిలోని జాతీయ రహదారిపై ముండ్లపాడు క్రాస్‌రోడ్స్ వద్ద కాలభైరవ ఆలయ ప్రాంగణంలో ఆదివారం శివలింగం, నాగేంద్రస్వామి, సుబ్రమణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా జరిగింది. చింతా పూర్ణచంద్రరావు, కుమారి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రతిష్టా కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### నేడు స్పందన కార్యక్రమం

**నందిగామ/కంచికచర్ల:** పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆర్డీఓ రవీంద్రరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి స్పందన కార్యక్రమం ప్రారంభమవుతుందని తహసీల్దార్ పి. శంకరబాబు ఆదివారం తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తోందన్నారు. డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### నేటి నుంచి గ్రంథాలయంలో వేసవి శిబిరం

**జగ్గయ్యపేట అర్బన్:** పట్టణంలోని జిల్లా గ్రేడ్-1 స్థాయి గ్రంథాలయంలో ఈనెల 8వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం జరుగుతుందని గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ ఆదివారం తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించి ఈ శిబిరంలో కథలు చదివించడం, పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్ష, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్‌తో పాటు స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ హ్యాండ్ రైటింగ్, తెలుగులో చక్కని దస్తూరి, సైన్స్, గణిత తదితర సబ్జెక్టుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ఉచిత శిక్షణ తదితర కార్యక్రమాలు నేర్పిస్తారని తెలిపారు. ప్రతి రోజు అతిథుల ప్రసంగాలు ఉంటాయని, 4 నుంచి 10వ తరగతి వరకు చదివే ప్రతి విద్యార్థి ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పట్టణానికి రాజ'మార్గాలు'

- నందిగామలో రహదారులకు మహర్దశ
- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల ప్రత్యేక దృష్టితో జోరుగా పనులు



కొత్తగా అభివృద్ధి చేసిన పట్టణంలోని సీఎం రోడ్డు


**నందిగామ:** పట్టణంలో రహదారులకు మహర్దశ పట్టింది. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో రోడ్లు దారుణంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకు దారుల్లో అవస్థలు పడుతున్నారు. అయితే పట్టణ ప్రజల అవసరాలపై స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ప్రత్యేక దృష్టి పెట్టి.. రహదారుల అభివృద్ధి, సైడ్ డ్రెయిన్ల ఏర్పాటు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి.

**పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా..**

నందిగామ పట్టణం ప్రస్తుతం డివిజన్ హెడ్ క్వార్టర్ కావడంతో నిత్యం అనేక ప్రాంతాలకు నుంచి వేలాదిమంది పలు వ్యాపకాలపై రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఈ తరుణంలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ఇరుకు రహదారుల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడవలసి వస్తోంది. దీనిని గమనించిన ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ వాటిపై ఫోకస్ పెట్టారు. ముందుగా పట్టణంలోని సీఎం రోడ్ విస్తరణ పనులు ప్రారంభించి, పూర్తి చేశారు. గతంలో ఆ ప్రాంతం కేవలం నివాసాలకు అనుగుణంగా మాత్రమే ఉండేది. ప్రస్తుతం సీఎం రోడ్ ప్రాంతం కమర్షియల్ కాంప్లెక్స్‌ల ఏర్పాటుతో కళకళలాడుతోంది. అదే తరహాలో ప్రధాన రద్దీ రోడ్లు అన్నీ కూడా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ప్రత్యేక దృష్టి పెట్టారు.

**పలు రహదారుల విస్తరణ..**

●పట్టణంలోని పలు రహదారులను విస్తరిస్తున్నారు. వాటిల్లో ప్రస్తుతం 32 అడుగులు ఉన్న చందర్లపాడు రోడ్డును 60 అడుగులకు విస్తరించనున్నారు. అలాగే ఇప్పుడు 30 అడుగులు ఉన్న రామన్నపేట రోడ్డును 60 అడుగులకు పెంచనున్నారు. అదే విధంగా 28 అడుగులు ఉన్న ఎమ్మార్వో ఆఫీస్ రోడ్‌ను 60 అడుగుల రోడ్డుగా అభివృద్ధి చేయనున్నారు. ఇక ప్రస్తుతం 28 అడుగులు ఉన్న గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డును 60 అడుగులకు విస్తరించనున్నారు.



పట్టణంలోని ప్రధాన రహదారుల అభివృద్ధికి సంబంధించిన చాట్

**రెండు నెలలలో పనులు పూర్తి..**



పట్టణంలోని అన్ని ప్రధాన రహదారుల విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే సీఎం రోడ్ పనులు పూర్తయ్యాయి. మరో రెండు నెలల్లో మిగిలిన రోడ్ల విస్తరణ పనులు పూర్తవుతాయి.

– డాక్టర్ జయరాం, మున్సిపల్ కమిషనర్, నందిగామ

# ఆలయాల అభివృద్ధికి సీఎం కృషి

**మునగాలపల్లిలో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయానికి ఎమ్మెల్యే శంకుస్థాపన**



ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

**నందిగామ టౌన్:** ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలంలోని మునగాలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయ నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ముందుగా వేద పండితుడు అంగర రాంబాబు ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి దేవదాయ ధర్మదాయ శాఖ నుంచి రూ. 36 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఆలయాల అభివృద్ధితో పాటు నూతన ఆలయాల నిర్మాణాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. అంతే కాకుండా ఆదాయం లేని ఆలయాలకు సైతం ధూపదీప నైవేద్యం పథకం ద్వారా ఆర్థిక సహకారం అందిస్తున్నారని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆలయాల అభివృద్ధితో పాటు నూతన ఆలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నారని కొనియాడారు. ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగపూడి వెంకటేశ్వరరావు, నాయకులు పెద్దబ్బాయ్, వైఎస్ఎన్ ప్రసాద్, కందుల నాగేశ్వరరావు, గరికపాటి భాస్కరం, నల్లాని సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



కొబ్బరికాయ కొడుతున్న కృష్ణప్రసాద్

**మక్కపేట(వత్సవాయి):** అన్నపూర్ణ సహిత శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి నూతన ఆలయానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ ఆలయం జీర్ణోద్ధరణకు చేరుకోవడంతో గ్రామస్తులు నూతన ఆలయాన్ని నిర్మించాలని తలంచారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను తెలపడంతో వెంటనే స్పందించిన ఆయను దేవదాయశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి నూతన ఆలయ నిర్మాణం కోసం రూ. 50 లక్షలను మంజూరు చేయించారు. నిధులు మంజూరు కావడంతో పాత ఆలయాన్ని తొలగించి ఆదివారం కొత్త ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిలర్ సామినేని వెంకటకృష్ణప్రసాద్ మాట్లాడుతూ కొత్త ఆలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడేటి శారమ్మ, సొసైటీ అధ్యక్షుడు కొండబోలు వెంకటబ్రహ్మం, గ్రామపెద్దలు కనగాల రమేష్, మల్లెల గాంధీ, శివ, కనగాల భాస్కరరావు, కొండబోలు కోటిబాబు, నారాయణ, అర్చకులు కేవైఎన్ శర్మ, యుగంధర్‌శర్మ, సంగయ్యశర్మ పాల్గొన్నారు.

# తిరుపతమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



భక్తులతో కిక్కిరిసిన తిరుపతమ్మ ఆలయ ప్రాంగణం



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

**పెనుగంచిప్రోలు:** గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావటంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆంధ్రా నుంచే కాక తెలంగాణ నుంచి కూడా వందల సంఖ్యల వాహనాల్లో భక్తులు తరలి వచ్చారు. వేలాది వాహనాలు తరలి రావటంతో ఆదివారం పెనుగంచిప్రోలు పుణ్యక్షేత్రం ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు వాహనాల రద్దీ కొనసాగింది.

**తిరుపతమ్మ సేవలో గుంటూరు ఎంపీ**

**పెనుగంచిప్రోలు:** గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారిని ఆదివారం గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, అధికారులు ఆయనను అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అమరరాజా గ్రూప్ వ్యవస్థాపకుడు గల్లా రామ్మూర్తినాయుడు, ఆలయ మాజీ చైర్మన్లు కర్ల వెంకటనారాయణ, నూతలపాటి చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ జయదేవ్‌కు ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ చైర్మన్ చెన్నకేశవరావు

**అమ్మవారిని దర్శించుకున్న న్యాయమూర్తులు..**

**పెనుగంచిప్రోలు:** గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపమ్మవారిని ఆదివారం నంద్యాల జిల్లా జడ్జి ప్రభాకర్, నంద్యాల సెషన్స్ జడ్జి అర్చన, పిఠాపురం సెషన్స్ జడ్జి శ్రీలీలసాయి సుభాష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి వారు రూ.51,116 విరాళంగా ఇచ్చారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు వారిని అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.



వేద పండితుల ఆశీర్వచనం తీసుకుంటున్న న్యాయమూర్తులు

## ఉత్సాహంగా యూత్ ఫర్ ఛేంజ్ 3కే వాక్‌థాన్



బీఆర్‌టీఎస్ రోడ్డులో వాక్‌థాన్‌లో పాల్గొన్న యువత

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** నేడు యువతలో పెరిగిపోతున్న ఒత్తిడిని తగ్గించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు యూత్ ఫర్ ఛేంజ్ 3కె వాక్‌థాన్ నిర్వహిస్తున్నట్లు లిటిల్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ విజయవాడ జోన్ అధ్యక్షురాలు పులి బిందు, జోన్ వర్కింగ్ సెక్రటరీ యశ్వంత్ కృష్ణ అన్నారు. స్థానిక బీఆర్టీఎస్ రోడ్డులో ఆదివారం లిటిల్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన ప్రపంచ అథ్లెటిక్ దినోత్సవం, జాతీయ బాలల యువత మానసిక ఆరోగ్య దినోత్సవం, రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి, అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని యూత్‌ఫర్ ఛేంజ్ 3 కే వాక్‌థాన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ కోశాధికారి ఎస్‌కే ఇర్ఫాన్, ఎం.వివేక్, ఎం.జయంత్‌కుమార్, జేడీ ఫౌండేషన్ చైర్మన్ ప్రియాంకరావు దుండి, జగన్ మురారి, హేమంత్‌కుమార్ పాల్గొని మాట్లాడారు.

# నవ్వు.. నాలుగు విధాలా మేలు



పాలేటి వద్ద స్విమ్మర్స్ సందడి

**జగ్గయ్యపేట అర్బన్:** ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణ శివారులోని పాలేటి నీటిలో డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈత సాధకులు నవ్వులతో సందడి చేశారు. స్విమ్మింగ్ కోచ్‌లు పొట్టాబత్తిన పాండురంగారావు, పొట్టాబత్తిన లక్ష్మి మాట్లాడుతూ ఆధునిక యాంత్రిక సమాజంలో మనిషి నవ్వును చాలా వరకు కోల్పోయాడన్నారు. ఆనందంగా నవ్వడంతో ఎంతో ఆరోగ్యంగా ఉంటారనే విషయం శాస్త్రీయంగా పరిశోధనల్లో కూడా రుజువు అయిందన్నారు. ప్రతి ఒక్కరూ ఆనందంగా గడుపుతూ నవ్వుతూ ఉండటానికి ప్రయత్నించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఈతలో శిక్షణ పూర్తిచేసుకున్న తనూష్ తమకు జ్ఞాపకంగా ఒక నేరేడు మొక్కను నాటాడు. ఈ కార్యక్రమంలో డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ సభ్యులు యలదండి శ్రీనివాస్, నరేష్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న ప్రతాప్, పక్కన ఉమా సరస్వతి తదితరులు

**విజయవాడ కల్చరల్:** తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలు, భాషా వికాసానికి శ్రీశ్రీ కళావేదిక కృషి చేస్తోందని ఆ సంస్థ అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో గవర్నర్‌పేటలోని బుక్ సొసైటీ ఫెస్టివల్‌లో ఆదివారం శ్రీశ్రీ కళావేదిక క్రియాశీలక సభ్యులతో ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి సాంకేతిక యుగంలోనూ వారసత్వ సంపదను భావితరాలకు అందించడానికి సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో సాహిత్య కార్యక్రమాలు, భాషా సదస్సులు, కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో అంతర్జాతీయ సమన్వయకర్త, జాతీయ కన్వీనర్ కొల్లి రమాపతి శ్రీశ్రీ కళావేదిక లక్ష్యాలను వివరించారు. శ్రీశ్రీ కళావేదిక జాతీయ కార్యదర్శి జి.ఈశ్వరీ భూషణం సంస్థ గతంలో నిర్వహించిన వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరి సర్వోత్తమ నాయుడు, శ్రీశ్రీ కళావేదిక జాతీయ మహిళా అధ్యక్షురాలు చిట్టేలలిత, ఆంధ్ర ప్రదేశ్ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు హరిసర్వోత్తమ నాయుడు, ఓలేటి ఉమా సరస్వతి, కట్ల భాగ్యలక్ష్మి, కళావేదిక సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ అంశాలపై చర్చించారు.

## 'పదో తరగతి విద్యార్థులకు విజేతలకు అభినందన



ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను సత్కరిస్తున్న విప్ ఉదయభాను

**జగ్గయ్యపేట అర్బన్:** పదో తరగతి పరీక్ష ఫలితాలలో జగ్గయ్యపేట పట్టణంలోని విజ్ఞాన్ హైస్కూల్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అభినందించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యధిక ప్రాధాన్యత నిస్తూ వారికి అనేక పథకాలను అమలు పరుస్తూ విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్నారని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసు కోవాలని కోరారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సందేశాత్మకంగా ఘంటసాల నాటక ప్రదర్శన



ఘంటసాల నాటకంలోని ఓ సన్నివేశం

**విజయవాడకల్చరల్:** గాయకునిగా, సంగీత దర్శకునిగా, నిర్మాతగా ఎందరికో స్ఫూర్తినిచ్చిన గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితంలో జరిగిన అనేక సంఘటలను ఏర్చికూర్చి నాటకంగా మలచి ప్రదర్శించిన ఘంటసాల నాటకం సందేశాత్మకంగా సాగింది. పోలవరపు కోటేశ్వరరావు సాహితీ పీఠం సాంస్కృతిక సమితి, మధురం సేవా సాంస్కృతిక సంస్థ హైదరాబాద్ నిర్వహణలో ఘంటసాల సంగీత కళాశాలలో ఆదివారం ఘంటసాల నాటకం ప్రదర్శించారు. ఘంటసాల బాల్యం, సంగీతం నేర్చుకోవడానికి విజయనగరం వెళ్లడం, పట్రాయని సంగీత రావు, కళావర్‌కింగ్, ద్వారం వెంకట స్వామి నాయుడుతో పరిచయం, సంగీతం నేర్చుకోవడం, సినీ రంగ ప్రవేశం, ఆ రంగంలో విజయం సాధించడం, పద్మశ్రీ పురస్కారం పొందడం అంశంగా నాటకం సాగుతుంది. రచన దర్శకత్వం, భాస్కరుని సత్య జగదీష్, ఘంటసాలగా ఇంద్రకుమార్, సావిత్రమ్మగా హారిక, ద్వారం వెంకటస్వామి నాయుడుగా జానకి రామయ్య, పట్రాయని సంగీత రావుగా కొండలరావు, కళావర్ కింగ్‌గా రామలక్ష్మి, కవి జాషువాగా శ్రీరాయలు నటించారు. సురభి కళాకారులు ప్రదర్శించిన ప్రతీ అంశంలోనూ సురభి నాటక సంప్రదాయం కనిపించింది. కార్యక్రమంలో ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్, గోళ్ల నారాయణరావు, డాక్టర్ ప్రభాకర్ సాహితీవేత్తలు డాక్టర్ గుమ్మా సాంబశివరావు పాల్గొన్నారు.

## ■ నవ్వు.. నవ్వించు..



ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో విజయవాడ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిపించారు. క్లబ్ సభ్యులందరూ ఒక చోట చేరి చిన్నా పెద్ద తేడాలేకుండా నవ్వులు పూయించారు. నవ్వు నాలుగు విధాలా మేలు చేస్తుందని చాటి చెప్పారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

## గాయని ఉమాబలరాం సేవలు ఆదర్శనీయం



**విజయవాడకల్చరల్:** గాయని ఉమా బలరాం సంగీత సేవలు ఆదర్శనీయమని శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. సరస్వతి కళాపీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో ఆదివారం సీనియర్ గాయని ఉమాబలరాం ఏక గళ సినీ సంగీత విభావరి, శాస్త్రీయ సంగీత ఆరాధనా కార్యక్రమం నిర్వహించారు. రమా సత్యనారాయణ మాట్లాడుతూ గాయనీగా ఉమబలరాం దేశ విదేశాల్లో అనేక ప్రదర్శనలు ద్వారా ప్రతిభను చాటుకున్నారన్నారు. సేవా రంగంలోనూ ఆమె సేవలను అందించారని తెలిపారు. కరోనా సమయంలో వేలాది మందికి నిత్యావసరాలను అందించారన్నారు. సరస్వతీ కళాపీఠం వ్యవస్థాపకురాలు మధిర రోజా ప్రసన్నత చేతుల మీదుగా ఉమాబలరాం దంపతులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో సాహితీ సంస్థల ప్రతినిధులు పరచూరి విజయలక్ష్మి, టి.శ్రీనివాసరెడ్డి, డేవిడ్‌రాజు పాల్గొన్నారు.